అంతర్రాష్ట్ర దోపిడీ దొంగల అరెస్ట్

- రూ.34 లక్షల విలువైన బంగారం, రెండు కార్లు, నాలుగు ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీపీ సునీల్‌దత్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్

వైరాటౌన్, మార్చి 11 : వాహనాల తనిఖీల్లో భాగంగా ఏపీ రాష్ట్ర సరిహద్దు నెమలి పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద కారులో అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురు అంతర్రాష్ట్ర దోపిడీ దొంగలను అరెస్ట్ చేసినట్లు ఖమ్మం సీపీ సునీల్‌దత్ తెలిపారు. వైరా పోలీస్‌స్టేషన్‌లో ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గత నెల వైరా మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు లీలా సుందరయ్యనగర్‌లో సర్వే పేరుతో దోపిడీ దొంగలు ఇంట్లోకి చొరబడి వృద్ధురాలిపై దాడి చేసి, రూ.15 లక్షల విలువైన బంగారాన్ని ఎత్తుకెళ్లారని తెలిపారు. ఈ కేసులో దోపిడీ దొంగలను పట్టుకునేందుకు వైరా ఏసీపీ రెహమాన్ ఐదు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం దాచాపురం సమీపంలో ఆంధ్రా సరిహద్దు నెమలి పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు వాహన తనిఖీల్లో భాగంగా కారులో అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురిని పట్టుకొని విచారించారు. గుంటూరుకు చెందిన రాయపాటి వెంకన్న, షేక్ నాగుల్‌మీరా, తమిళనాడు రాష్ట్రానికి చెందిన ముత్తురాజు మురుగేషన్, ఉన్నన్ విజయ్‌లు వైరాతోపాటు కర్ణాటక రాష్ట్రంలో మరో చోరీ చేశారని, వారి వద్ద నుంచి 34 తులాల బంగారం, రెండు కార్లు, నాలుగు సెల్‌ఫోన్లు, మారణాయుధాలు, నకిలీ నెంబర్ ప్లేట్లు, పోలీస్ యూనిఫాంను స్వాధీనం చేసుకొని వారిని మధిర కోర్టుకు రిమాండ్ చేసినట్లు వివరించారు. సమావేశంలో ఏసీపీ రెహమాన్, సీఐ సాగర్, వైరా సర్కిల్ ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.2వేల కోట్లతో పాలేరులో అభివృద్ధి పనులు

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి (నేలకొండపల్లి), మార్చి 11: పాలేరు నియోజకవర్గంలో విద్య, వైద్యం సాగునీటి రంగాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ఈ సంవత్సరంలో రూ.2 వేల కోట్లతో అన్నీ రంగాలను అభివృద్ధి చేస్తామని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. కూసుమంచి పర్యటనలో భాగంగా మంగళవారం కూసుమంచిలో మాట్లాడారు. మున్నేరు కరకట్టకు రూ.550 కోట్లతో నిర్మాణం జరుగుతుందని, మరో రూ.120 కోట్లు ఖర్చు పెడతామన్నారు. కరకట్టలో భూములు కోల్పోయిన రైతులకు భూమి కింద భూమిని ఇస్తామని తెలిపారు. ప్రస్తుతం మంజూరైన రూ. 35 కోట్ల చెక్ డ్యాం పనులకు త్వరలో టెండర్లు పిలుస్తామని తెలిపారు.

'పథకాల అమలు ఆలస్యమైనా అందిస్తాం'

రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి బాగా లేని కారణంగా పథకాల అమలులో కొంత ఆలస్యం అవుతుందే కానీ ఇచ్చిన హామీలు తప్పకుండా నెరవేర్చుతామనిరాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం నేలకొండపల్లి మండలంలోని పలు గ్రామాల్లో 10 గ్రామాల్లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాజేశ్వరపురం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందిని, ఇప్పుడు రాని వారు బాధ పడాల్సిన పనిలేదన్నారు. వేసవి సమీపిస్తున్నందున సాగునీటి విషయంలో ఇరిగేషన్, వ్యవసాయశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎక్కడా ఎలాంటి సమస్య రాకుండా జాగ్రత్త పడాలన్నారు. ఒక్క ఎకరాకు కూడా నీరు అందలేదనే సమస్య రావద్దు ఈ రకంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీలో నర్సింహరావు, ఏసీపీ తిరుపతిరెడ్డి, నాయకులు మువ్వా విజయ్‌బాబు, తుళ్లూరి బ్రహ్మయ్య, మద్దినేని స్వర్ణకుమారి, మార్కెట్ చైర్మన్ వెన్నెపూసల నాయకులు శాకమూరి రమేశ్, కొడాలి గోవిందరావు, నెల్లూరి భద్రయ్య, ఏడీఏ సరిత తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి గ్రీన్ ఛానల్‌లో నిధులు విడుదల

వైరాటౌన్, మార్చి11: ఆర్థికంగా ఎటువంటి ఇబ్బందులు ఉన్నా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇబ్బందులు ఏర్పడకుండా గ్రీన్‌ఛానల్‌లో నిధులు మంజూరు చేయడం జరుగుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం మంత్రి మండలంలోని పుణ్యపురం గ్రామంలో జిల్లా కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌లతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ, శంకుస్థాపన చేశారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులపై దంపతులకు నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పది సంవత్సరాలు గత ప్రభుత్వ హయాంలో ప్రజలు పడిన ఇబ్బందులు గమనించి ప్రజా ప్రభుత్వం ఏర్పడిన సంవత్సర కాలంలోనే పేదలకు ఇందిరమ్మ ఇళ్లను అందించాలనే లక్ష్యంతో 4.50లక్షల ఇళ్లు, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, హౌసింగ్ పీడీ బీ శ్రీనివాసరావు, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి కె.సత్యనారాయణ, ఖమ్మం ఆర్‌డీవో నర్సింహారావు, వైరా తహసీల్దార్ కేవి.శ్రీనివాసరావు, ఎంపీడీవో సరస్వతి, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలి

ఖమ్మం జిల్లాలో మిర్చి బోర్డు ఏర్పాటుకు చొరవ చూపాలని, మిర్చి క్వింటాకు రూ.25వేలు మద్దతు ధర నిర్ణయించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నాఫెడ్, మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని కోరుతూ మంగళవారం వైరా మండలం పుణ్యపురం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ళు శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి, తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు ఖమ్మం జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రిపొంగులేటి శ్రీనివాస రెడ్డికి వివరించారు. మంత్రిపొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రైతుల సమస్యలు పరిష్కారానికి తనవంతు ప్రయత్నాలు చేస్తామని హామీ ఇచ్చారు.

సైలో బంకర్ బాధితుల రైల్ రోకో

సైలో బంకర్ వద్ద రైలుకు అడ్డంగా పడుకున్న ఆందోళనకారులు

సత్తుపల్లిటౌన్, మార్చి 11 : 30 రోజులుగా శాంతి యుతంగా రిలే దీక్షలు చేస్తున్నా సింగరేణి అధికారులు స్పందించకపోవడంతో కిష్టారం గ్రామంలోని అంబేద్కర్ నగర్ కాలనీవాసులు మంగళవారం రైల్‌రోకో చేపట్టారు. సైలో బంకర్ వల్ల ముప్పు ఏర్పడుతుందని కాలనీకి చెందిన సుమారు 250 కుటుంబాల వారు 30 రోజుల నుంచి దీక్షలు చేపట్టారు. అయినా సింగరేణి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సింగరేణి ఉన్నతాధికారులు, రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో సైలో బంకర్ నుంచి రైలుమార్గంలో వెళ్లే రైలు పట్టాలపై పడుకొని ఆందోళన చేపట్టారు. దీంతో సత్తుపల్లి నుంచి కొత్తగూడెంకు వెళ్లే మూడు గూడ్స్ రైళ్లు నిలిచిపోయాయి. ఇప్పటికైనా తమ సమస్య పరిష్కారానికి స్పష్టమైన హామీ ఇవ్వకపోతే పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంటామని పురుగు మందు డబ్బాలను సైతం వారి వెంట తెచ్చుకున్నారు.

సభ్యత్వ నమోదు సభ సక్సెస్‌పై టీడబ్ల్యూజేఎఫ్ హర్షం

రఘునాథపాలెం, మార్చి 11: తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) సోమవారం చేపట్టిన సభ్యత్వ నమోదు సభ విజయవంతం కావడంపై యూనియన్ పల్లా కొండల్‌రావు, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, సయ్యద్ ఖదీర్, దువ్వా సాగర్, కూరాకుల గోపి, కొత్తా యాకేశ్, షేక్ జానీ, యోగినాటి మాధవరావు మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. జిల్లా నుంచి పెద్దఎత్తున తరలివచ్చిన విలేకరులకు కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న అన్నిరకాల సమస్యల పరిష్కారానికి తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని యూనియన్ రాష్ట్ర, జిల్లా నేతలు భరోసా కల్పించారు. పదవుల కోసం పాకులాడకుండా జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకుసాగాలని నిర్ణయించారు. నియోజకవర్గాల వారీగా సభ్యత్వ నమోదు సమావేశాలు నిర్వహించాలని యూనియన్ నేతలు పిలుపునిచ్చారు. మొత్తం 205 సభ్యత్వాలు నమోదైనట్లు పేర్కొన్నారు.

చెస్‌లో సర్వజ్ఞ విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులతో డైరెక్టర్ నాగేంద్రకుమార్

ఖమ్మం అర్బన్, మార్చి 11: ఖమ్మం నగరంలోని సర్వజ్ఞ పాఠశాలకు చెందిన విద్యార్థులు చెస్ పోటీల్లో సత్తా చాటినట్లు పాఠశాల డైరెక్టర్ కొలిపాక నీలిమ తెలిపారు. అత్యుత్తమ ప్రదర్శన చేసి బహుమతులు గెలుచుకున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం విద్యార్థులను డైరెక్టర్ రాజా వాసిరెడ్డి నాగేంద్రకుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

ఖమ్మం మార్కెట్‌కు 14నుంచి సెలవులు

రఘునాథపాలెం, మార్చి 11 : ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు ఈ నెల 14వ తేదీ నుంచి మూడ్రోజులపాటు సెలవులు ఉంటాయని మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14వ తేదీ హోలీ, 15, 16వ తేదీల్లో వారాంతపు సెలవులు ఉంటాయని, రైతులు గమనించి పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకరావద్దని సూచించారు. తిరిగి సోమవారం మార్కెట్ యధావిధిగా కొనసాగుతుందని తెలిపారు.

16న ఏకలవ్య మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

రఘునాథపాలెం, మార్చి 11 : రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరం 6వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 16వ తేదీన ఆదివారం రఘునాథపాలెం కేసీఆర్‌కాలనీలో గల గిరిజన ప్రతిభా పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ మల్లెల బాలస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటల నుంచి 2:30 గంటల వరకు నిర్వహించే పరీక్షకు సకాలంలో చేరుకోవాలని సూచించారు. వివరాలకు 9441785535, 9440801575 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఇగ్నో ప్రవేశాలకు 15వరకు గడువు

ఖమ్మం అర్బన్, మార్చి 11 : ఇగ్నో స్టడీ సెంటర్‌లో ప్రవేశాలు పొందేందుకు ఈ నెల 15వ తేదీ వరకు గడువు ఉందని ఇగ్నో అసిస్టెంట్ రీజనల్ డైరెక్టర్ రాజు తెలిపారు. మంగళవారం ఖమ్మం నగరంలోని కవితా మెమోరియల్ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వికసిత్ భారత్-2047 లక్ష్యసాధనలో యువత పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమణారావు పాల్గొన్నారు.

యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని నిర్వీర్యం చేసేందుకు కుట్ర

ఖమ్మం అర్బన్, మార్చి 11 : కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన యూజీసీ నూతన ముసాయిదా దేశ సమైక్య స్ఫూర్తికి పూర్తి విరుద్ధమని, విద్యారంగ హక్కులను కాలరాయడమేనని పీడీఎస్‌యూ నాయకులు ఆజాద్, వెంకటేష్ అన్నారు. మంగళవారం పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కేయూ సబ్ క్యాంపస్‌లో యూజీసీ నూతన ముసాయిదా 2020ను వ్యతిరేకంగా 'విశ్వవిద్యాలయాల స్వయంప్రతిపత్తిని కాపాడుకుందాం' అనే అంశంపై లక్ష్మణ్ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సందీప్, నసీర్, భారత్, ప్రియాంక, అఖిల, సింధు తదితరులు పాల్గొన్నారు.

రవన్న వర్ధంతి

ఖమ్మం కమాన్‌బజార్, మార్చి 11 : విప్లవ కమ్యూనిస్టు యోధుడు రాయల సుభాష్ చంద్రబోస్(రవన్న) 9వ వర్ధంతిని ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత జడ్పీ సెంటర్ నుంచి వైరా రోడ్డు మీదుగా ప్రదర్శన నిర్వహించారు.

శ్రీచైతన్యలో కొనసాగిన ఐటీ దాడులు

రూ.25 లక్షలు క్యాష్?, పలు డాక్యుమెంట్లు సీజ్

తనిఖీ సమయంలో ఆందోళ న చెందిన విద్యార్థులు

ఖమ్మం అర్బన్, మార్చి 11: దేశవ్యాప్తంగా శ్రీచైతన్య విద్యాసంస్థల్లో ఐటీ అధికారులు రెండు రోజులుగా ఆకస్మిక సోదాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఖమ్మంలోని శ్రీచైతన్య విద్యాసంస్థల్లో సోమవారం రాత్రి మొదలైన ఐటీ సోదాలు మంగళవారం రాత్రి వరకు కొనసాగుతూనే ఉన్నాయి. సుమారు పది మంది అధికారుల బృందం రికార్డులను పరిశీలిస్తున్నది. ఏపీకి చెందిన శ్రీచైతన్య ఆధ్వర్యంలోనే రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో అత్యధిక బ్రాంచ్‌లతో పాఠశాలలను ఖమ్మం హెడ్డాఫీసుగా నిర్వహణ సాగిస్తుండగా ఆ మేరకు ఐటీ అధికారులు దాడులు చేసినట్లు తెలుస్తున్నది. ఖమ్మంలోని ఎస్ ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల ఎదురుగా ఉన్న క్యాంపస్ వద్ద 24 గంటలపాటు ఐటీ అధికారులు రికార్డులు తిరగేస్తున్నారు. విద్యాసంస్థలో కీలకంగా ఉన్న వ్యక్తుల నుంచి వివరాలు రాబట్టడంతోపాటు అకౌంట్స్ విధులు నిర్వహించే వారి నుంచి సమాచారం సేకరించారు. విద్యార్థులు కట్టే ఫీజు రశీదులతోపాటు డాక్యుమెంట్లు, కంప్యూటర్ల లోని డేటాను సైతం సేకరించారు.

ఇటు పరీక్షలు, అటు సోదాలు..

అయితే కళాశాలలోని ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రం ఉన్న బ్రాంచ్‌లో తనిఖీలు చేపట్టడంతో విద్యార్థులు, కళాశాల యాజమాన్యం తీవ్ర ఆందోళనకు గురైంది. ఒక్కసారిగా ఐటీ అధికారులు, పోలీసులు అక్కడికి చేరుకోవడంతో ఏం జరుగుతుందోనని విద్యార్థులు పరీక్ష రాయడంపై దృష్టి సారించడం లేదని తెలుస్తున్నది. ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాయడానికి విద్యార్థులు కేంద్రానికి చేరుకోవడం.. అప్పటికే తనిఖీలు కొనసాగుతుండడంతో ఏం జరుగుతుందోననే ఆతృత విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో నెలకొంది.

రూ.25 లక్షల క్యాష్ సీజ్?

ప్రధాన కేంద్రంగా ఉన్న క్యాంపస్‌తోపాటు ఇతర క్యాంపస్‌లు, ఇళ్లలోనూ ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఇతర వ్యక్తులు ఎవరినీ లోపలికి అనుమతించకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఐటీ అధికారులు సోదాలు చేస్తున్న కేంద్రంలోనే ఇంటర్ పబ్లిక్ పరీక్షలు జరుగుతున్నప్పటికీ అడ్మిన్ గది మూసివేసి నిరంతరాయంగా సోదాలు చేస్తున్నారు. విద్యాసంస్థ యాజమాన్యాన్ని పలు అంశాల్లో ప్రశ్నించారు. విద్యార్థులు ఎంత మంది? ఏ రూపంలో ఫీజు వసూలు చేశారు? వసూలు చేసిన ఫీజుకు రశీదులు సమంగా ఉన్నాయా? కళాశాలలో కీలకంగా పనిచేసే వ్యక్తులు ఎక్కడెక్కడ అకౌంట్స్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు? అనే దానిపై పలుచోట్లకు తీసుకెళ్లినట్లు తెలుస్తున్నది. ఐటీ అధికారుల సోదాల్లో సుమారు రూ.25 లక్షలు క్యాష్ సీజ్ చేసినట్లు సమాచారం. పలు డాక్యుమెంట్లను సైతం సీజ్ చేసినట్లు తెలుస్తున్నది.

అరుదైన శస్త్రచికిత్సతో మహిళకు ప్రాణదానం

ఆరుగంటలు శ్రమించిన ప్రశాంతి ఆసుపత్రి వైద్యులు

షేక్ నజీమాతో ప్రశాంతి ఆసుపత్రి వైద్యులు

ఖమ్మం రూరల్, మార్చి 11 : ప్రశాంతి వైద్యశాలనాకు పునర్జన్మనిచ్చిందని షేక్ నజీమా భావోద్వేగంతో చెప్పింది. ఖమ్మం నగరంలోని ప్రశాంతి సూపర్ స్పెషాలిటీ వైద్యశాల ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ మహిళకు అరుదైన శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడింది. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆసుపత్రి వైద్యులు యండీ జనరల్ మెడిసిన్ డాక్టర్ కేసోజు భరత్‌బాబు, గ్యాస్ట్రో వైద్యులు డాక్టర్ భస వయ్య చౌదరి, అనస్తీయ వైద్యులు కుసువరాజు, శస్త్రచికిత్స వైద్యులు డాక్టర్ హేమంత్‌బాబు మాట్లాడారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడకు చెందిన షేక్ నజీమా(40) అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు వెళ్లగా 11రోజులు ఉంచి అన్నిరకాల వైద్యపరీక్షలు చేసి శస్త్రచికిత్స ప్రారంభించి పొట్టభాగంలో ఓపెన్ చేసి, పేగులు, గర్భసంచి, మూత్రనాళాలు గడ్డలతో అతుక్కొని ఉన్నాయని, ఆపరేషన్ చేస్తే మనిషి ప్రాణానికి ముప్పు ఉంటుందని తిరిగి కుట్లు వేశారు. దీంతో కోదాడకు తిరిగి వచ్చిన నజీమా ఆరోగ్యం క్షీణించడంతో ఖమ్మంలోని ప్రశాంతి వైద్యశాలను సంప్రదించింది. డాక్టర్లు పరీక్షలు నిర్వహించి సుమారు ఆరుగంటలపాటు శ్రమించి ఆపరేషన్ చేశారు. పదిరోజుల అనంతరం క్షేమంగా ఇంటికి పంపించారు. ఈ విలేకరుల సమావేశంలో ప్రశాంతి వైద్యశాల మేనేజ్‌మెంట్ చింతోజ్ మధుసూదన్, బీరుబాబు, శివ, నరేష్, ప్రదీప్, రోగి నజీమా, ఆమె కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సుధాకుమారికి గాన కోకిల అవార్డు

అవార్డు అందుకుంటున్న సుధాకుమారి

బోనకల్లు, మార్చి11: మండలంలోని కలకోట గ్రామానికి చెందిన యంగల సుధాకుమారి భారత్‌విభూషణ్ ఉద్యమ జానపద గాన కోకిల అవార్డును దక్కించుకున్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో 'విజన్ నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్' సంస్థ, జీసీఎల్ వల్లూరు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు సుధాకుమారిని సన్మానించి అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా సుధాకుమారి మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా కలలను నమ్ముకొని కలని జీవనాధారంగా చేసుకొని బతుకు జీవనం సాగిస్తున్నానని తెలిపారు. తనను గుర్తించి ప్రోత్సహించిన జీసీఎల్ వల్లూరు ఫౌండేషన్, విజయం నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వారికి రుణపడి ఉంటానని తెలిపారు.

మహిళలు ఆర్థిక, సామాజిక స్వావలంబన కలిగి ఉండాలి: కలెక్టర్

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్

వైరాటౌన్, మార్చి 11: ఆధునిక ప్రపంచంలో పోటీ తత్వం పెంచుకుంటూ మహిళల జీవితాల్లో స్పష్టమైన మార్పు దిశగా ఖమ్మం జిల్లాలో అడుగులు పడుతున్నాయని, భవిష్యత్‌లో మహిళా అభివృద్ధికి మరింత మెరుగ్గా పనిచేయాలని జిల్లా కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కేజీ సిరిపురం గ్రామ మహిళా సమాఖ్య సమావేశంలో మాట్లాడారు. గ్రామం పరిస్థితి అందుతున్న సేవలు, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగారు. ఈస ందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికం అంటే డబ్బు లేకపోవడం కాదని, ఉన్నడబ్బును సరైన మార్గంలో ఉపయోగించుకొని మరింత ఆర్థికంగా ఎదగడం ముఖ్యమని తెలిపారు. మహిళలు ఆర్థికంగా బలపడాలనే సంకల్పంతో ఇందిరా మహిళా శక్తిలో భాగంగా స్త్రీ టీ స్టాల్, మిల్క్ పార్లర్, పాడి పశువుల యూనిట్‌లు, బ్యాక్ యార్డ్ పౌల్ట్రీ, మైక్రో ఎంటర్‌ప్రైజెస్, క్యాంటీన్‌లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీవో నూరొద్దీన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌ను పరామర్శించిన సీపీ

మామిళ్లగూడెం, మార్చి 11 : సత్తుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో అంతర్రాష్ట్ర దొంగను అదుపు చేసే ఘటనలో కత్తిపోట్లకు గురైన కానిస్టేబుల్ మల్లెల నరేష్‌ను పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ మంగళవారం ఆసుపత్రిలో పరామర్శించారు. ఆరోగ్య ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్‌ను పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. స్థానిక పోలీసులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

ఎల్ ఆర్ ఎస్ కోసం ప్రత్యేక కౌంటర్లు

ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మం, మార్చి 11 : ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని ప్లాట్ల యజమానులు ఎల్ఆర్ఎస్ చెల్లించేందుకు ఖమ్మం నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. మంగళవారం ఖమ్మం నగరంలో ఏర్పాటు చేసిన పలు ప్రత్యేక కౌంటర్లను కమిషనర్ పరిశీలించారు. నగరంలో ఆంజనేయస్వామి టెంపుల్ బురాపురం, కమాన్‌బజార్ షాదీఖానా, గాంధీపార్కు, మామిళ్లగూడెం, అయ్యప్పస్వామి టెంపుల్ శ్రీనివాస్ నగర్, పంబానగర్, కొలిపాక ఫంక్షన్‌హాల్, ఇందిరానగర్, వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ వీడియోస్ కాలనీ, గొల్లగూడెంలో ఏర్పాటు చేసిన కౌంటర్లలో ఎవరెవరు ఉంటున్నారనేది పరిశీలించి కౌంటర్ దగ్గరికి వచ్చిన దరఖాస్తుదారుల సందేహాలను సిబ్బంది ఎలా నివృత్తి చేస్తున్నారో తెలుసుకున్నారు.

తలసేమియా చిన్నారులకు సదరం సర్టిఫికెట్లు

డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్‌గౌడ్

ఖమ్మం, మార్చి 11 : తలసేమియా, సికెల్‌సెల్ చిన్నారులకు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న సదరం సర్టిఫికెట్లు త్వరలోనే మంజూరుకానున్నట్లు డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్‌గౌడ్ తెలిపారు. మంగళవారం ఖమ్మంలోని సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయం వద్ద తలసేమియా చిన్నారులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సింగిల్ పేరెంట్‌గా ఉండి చిన్నారులను కాపాడుకుంటున్న మహిళలను ఘనంగా సత్కరించారు. సంస్థ ఫౌండర్ ప్రొద్దుటూరి అనిత, వైద్యులు డి.నారాయణమూర్తి, జాబిశెట్టి రేణుక, లక్ష్మీదీపా, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ శ్రీనివాస్, విద్యాక్షేత్ర స్కూల్ కరస్పాండెంట్ భాగ్య, అనురాధ, సంస్థ బాధ్యులు ప్రొద్దుటూరి పావని, ప్రొద్దుటూరి రవిచందర్, ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయాల పునరుద్ధరణకు ఎమర్జెన్సీ రిస్టోర్ బృందాలు

మామిళ్లగూడెం, మార్చి 11 : జిల్లాలో విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని, విద్యుత్ అంతరాయాల సమయాన్ని తగ్గించేందుకు పునరుద్ధరణకు ఎమర్జెన్సీ రిస్టోర్ టీంలను ఏర్పాటు చేసినట్లు టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మున్సిపాల్టీలు ఖమ్మం నగరపాలక సంస్థతోపాటు మధిర, వైరా, సత్తుపల్లి, ఏదులాపురం మున్సిపాల్టీలతోపాటు మండల కేంద్రాలలో ఈ బృందాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ప్రకృతి వైపరిత్యాలు, విద్యుత్ సాంకేతిక కారణాలతో ఏర్పడే అంతరాయాలను తగ్గించడానికి బ్రేక్ డౌన్ టీంలను ఏర్పాటు చేశామని, ఈ బృందం ఈఆర్‌టీ వాహనాల ద్వారా జీపీఆర్ఎస్ లోకేషన్ ప్రకారంగా వేగంగా వెళ్లి సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. ఈ వాహనంలో ఎమర్జెన్సీకి అవసరపడే వస్తువులు థర్మోవిజన్ కెమెరాలు, రంపాలు